సీసీ డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ


భూమిపూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రావికమతం: కొత్తకోట గుమ్ముడు వీధి రామాలయం నుంచి నంది విగ్రహం వరకు సీసీడ్రైనేజీ నిర్మాణానికి ప్రొటోకాల్ జెడ్పీటీసీ తలారి ఆదిమూర్తి, సర్పంచ్ లోవరాజు శుక్రవారం భూమి పూజ చేశారు. రూ.5 లక్షల జెడ్పీ నిధులతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. వైస్ సర్పంచ్ పందేల దేవా, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి శీలం శంకరావు, నాయకులు కేదారిశెట్టి గున్నాజీ, గుమ్ముడి దొరబాబు, రాజేష్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పీవో, సూపర్‌వైజర్‌పై చర్యలకు డిమాండ్


నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కె.కోటపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలపై సిబ్బంది వేధింపులు, వ్యక్తిగత దూషణలు ఆపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఐసీడీఎస్, తహసీల్దారు కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపారు. ఐసీడీఎస్ పీవో, సూపర్‌వైజర్ వైఖరితోనే ఇటీవల పోతనవలస అంగన్‌వాడీ కార్యకర్త నూకరత్నం ఆత్మహత్యకు ప్రయత్నించిందన్నారు. దీనికి కారకులైన సదరు ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టాలని సీఐకు సీపీఎం నాయకులు యర్రా దేముడు, ఈర్లె నాయుడుబాబు ఫిర్యాదు చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు పి.భవాని, జి.కుమారి, కోమలి, అమ్మాజీ, ఈశ్వరమ్మ, తులసి పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు


బహుమతులు అందుకున్న విజేతలతో ట్రైనీ డీఎస్పీ చైతన్య, ఎంఈవో తలుపులు

నర్సీపట్నం: అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నమూనా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రైనీ డీఎస్పీ చైతన్య హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులో భయాన్ని పోగొట్టేందుకు నమూనా పరీక్ష దోహదపడుతుందన్నారు. మొదసారి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు భయం, ఆందోళన చెందవద్దన్నారు. పదో తరగతి మీ భవిష్యత్తుకు తొలి మెట్టు అన్నారు. ఎంఈవో తలుపులు మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో ఎక్కువ సమయం చదువుకు కేటాయించాలన్నారు. బాగా రాసి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకువాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై రమేష్, హెచ్ఎం మాధవి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.బాబ్జి, జి.ఫణీంద్ర కుమార్, నియోజకవర్గ నాయకుడు కిరణ్ పాల్గొన్నారు.

శత శాతం ప్రకృతి వ్యవసాయం లక్ష్యం


రైతులతో మాట్లాడుతున్న ఏవో రూప

రావికమతం: జెడ్.కొత్తపట్నం గ్రామంలో శత శాతం ప్రకృతి వ్యవసాయం చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని మండల వ్యవసాయాధికారి డి. రూప తెలిపారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వెలుగు సిబ్బంది కలిసి శుక్రవారం ఇక్కడ గ్రామ రైతులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని శత శాతం ప్రకృతి వ్యవసాయంగా మార్చేందుకు ఎంపిక చేశామని తెలిపారు. తొలకరిలో అన్ని రకాల పంటలు ప్రకృతి సేద్యం విధానంలో పండించడానికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇందుకోసం సహజ సిద్ధంగా దొరికే వనరులతో కషాయలను, గోమూత్రం, ఆవు పేడతో తయారు చేసే ఎరువులు వాడటం వల్ల అధిక దిగుబడులు వస్తాయని వివరించారు. రసాయన ఎరువులు వల్ల నష్టాలు గురించి ప్రతి రైతు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, వైస్ సర్పంచ్, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

40 మందికి కంటి పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి నాయుడు

రావికమతం: మండలంలో కవగుంట గ్రామంలో వెంకటేశ్వర పుష్పగిరి ఆస్పత్రి సౌజన్యంతో సర్పంచ్ దాసరి సూర్యకుమారి వరహాలు ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి 40 మంది రోగులు హాజరయ్యారు. వీరికి ఆప్తాల మిస్టు వై నాయుడు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 8 మందికి ఆపరేషన్లు అవసరంగా గుర్తించారు. 9 మందికి కళ్లద్దాలకు సిఫార్సు చేశారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆపరేషన్ అవసరమైన 8 మందిని వెంకటేశ్వర పుష్పగిరి ఆస్పత్రికి తరలించారు.

సామరస్యంగా సమస్యల పరిష్కారం


ఇరువురికి కౌన్సెలింగ్ చేస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగ శిరీషా

నాతవరం: వ్యక్తిగత విద్వేషాలకు పోయి చిన్నపాటి సమస్యలను జఠిలం చేసుకోవడం తగదని మండల ప్రత్యేకాధికారి నాగశిరీషా తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ ఫిర్యాదుదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ఇరువురి వద్ద రికార్డుల ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి న్యాయం చేస్తామన్నారు. దీనికి ఇరువురి అంగీకారం తెలిపితే అన్ని వర్గాలకు మంచిదన్నారు. పంతాలకు పోతే ఇరువురికి తీవ్ర నష్టం కలుగుతుందని కౌన్సెలింగ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలుపర్తి పార్థసారిథి, డిప్యూటీ తహసీల్దార్ టి. లోవరాజు, పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

150 మంది పేదలకు దుప్పట్ల పంపిణీ


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సూర్యారావు

కె.కోటపాడు: ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని అమ్మా భగవాన్ భక్త సంఘం మండలాధ్యక్షుడు విన్నకోట సూర్యారావు తెలిపారు. అమ్మా భగవాన్ 74వ జన్మదినోత్సవాన్ని శుక్రవారం ఆనందపురంలో నిర్వహించారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల నుంచి వచ్చిన అమ్మా భగవాన్ భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వివిధ గ్రామాలకు చెందిన 150 మంది పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం జన్మదిన కేక్ కటింగ్ చేసి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విన్నకోట అయ్యప్ప, వంటాకు మహేష్, రాజా(ఆయిల్ మిల్), వేచలపు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ


టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న కె.వి.రమణ, శ్రీను

దేవరాపల్లి: పెదనందిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని వితరణ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కొరుప్రోలు శ్రీను వీటిని సమకూర్చారు. హైస్కూల్ హెచ్ఎం డి.శ్రీనివాసరావు సమక్షంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ శుక్రవారం అందజేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు గంగవంశం సంతోష్, అజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధులకు సకాలంలో హాజరు కావాలి


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

మాకవరపాలెం: విధులకు సకాలంలో హాజరు కావాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పైడిపాల సచివాలయాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రజలకు సేవలందించే విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. శనివారం నుంచి చేపట్టే పి– 4 సర్వేను సక్రమంగా చేయాలన్నారు. గ్రామాల్లో చర్మకారుల వివరాలను సర్వే ద్వారా సేకరించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన సర్వేల్లో అలక్ష్యం వద్దన్నారు.



ఉత్తమ సేవలందించిన మహిళలకు సత్కారం


వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ మాధవిని సత్కరిస్తున్న దృశ్యం

మాడుగుల: స్థానిక గ్రామీణ వికాస్ బ్యాంకులో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మహిళా ఖాతాదారులతోపాటు వెలుగు మహిళా సీసీలు, వీవోఏలను బ్యాంకు మేనేజర్ సుబ్బకృష్ణ, ఎంపీఎం అప్పలనర్సమ్మ దుశ్శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఉత్తమ సేవలందించిన బ్యాంకు మిత్ర గోపాసిన లక్ష్మిని బ్యాంకు మహిళా సిబ్బంది, వెలుగు సిబ్బంది సన్మానించారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్లు మనోజ్ కుమార్, నాగరాజు, అకౌంటెంట్ నాగేశ్వరరావు, వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ పుట్టా మాధవి, వెలుగు సీసీలు, గణేష్, శ్రీనువాసరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నేడు

దేవరాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల స్థాయిలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల మహిళా ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు మహిళా దినోత్సవ ఏర్పాట్లపై శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎ. కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి డి.వి. లక్ష్మీనారాయణ, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ వి.పి.వి. త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.


ఉత్తమ బ్యాంకు మిత్ర లక్ష్మిని సత్కరిస్తున్న మేనేజర్ కృష్ణ, ఏపీఎం అప్పలనర్సమ్మ


మహిళా దినోత్సవ ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎంపీడీవో సువర్ణరాజు